సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
శుక్రవారం | 17 | మార్చి | 2023



క్వాలిఫైడ్‌లకు ఉగాది ప్రైజ్

డీఎస్సీ–1998 క్వాలిఫైడ్ అభ్యర్థులకు ఉద్యోగాలు ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం జీవో నంబరు 27ను విడుదల చేసింది. దీనిపై హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. - 8లో▸



సెకండ్ ఇంటర్ పరీక్షలు ప్రారంభం

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లావ్యాప్తంగా ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు గురువారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. - 8లో▸

డెల్టాలకు 7,030 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు గురువారం 7,030 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 2,170, మధ్య డెల్టాకు 1,410, పశ్చిమ డెల్టాకు 3,450 క్యూసెక్కులు వదిలారు. బ్యారేజీ వద్ద నీటి మట్టం 5.20 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

నీట్ పీజీలో ప్రతిభ చూపిన సత్యవాసుకి



దూళిపూడి వెంకట సత్యవాసుకి

మామిడికుదురు: నీట్ పీజీ పరీక్షల్లో మామిడికుదురుకు చెందిన దూళిపూడి వెంకట సత్యవాసుకి జాతీయ స్థాయిలో 2083వ ర్యాంకు సాధించింది. విశాఖపట్నం గాయత్రి వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ పూర్తి చేసిన వాసుకి ర్యాంకు సాధించింది. ఇప్పుడు ఆమె వైద్య రంగంలో ఎండీ జనరల్ మెడిసన్ కోర్స్ చదువుతోంది. ఆమె దీప్తి విద్యా సంస్థల అధినేత డీవీవీ.సత్యనారాయణ కుమార్తె. ఆమె తల్లి భ్రమరాంబ లూటుకుర్రు ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా వాసుకి మాట్లాడుతూ గ్రామీణ స్థాయిలో పేదలకు వైద్యం అందించాలన్న లక్ష్యంతో తాను ఇంటర్ నుంచి ప్రణాళిక ప్రకారం చదువుకున్నానని పేర్కొంది. తల్లితండ్రుల ఇచ్చిన ప్రోత్సాహంతో ఈ ర్యాంకు సాధించానని ఆమె పేర్కొంది.

చీకటి తొలగించిన వైఎస్సార్ కంటి వెలుగు



కంటిచూపు వచ్చిన శ్రీనివాస్

రాజోలు: అంధత్వంతో బాధపడుతున్న వారికి అండగా నిలుస్తోంది వైఎస్సార్ కంటి వెలుగు పథకం. ఈ పథకంలో భాగంగా ఉచితంగా కంటికి శస్త్ర చికిత్స చేయించుకుని చీకటి బతుకును జయించాడు రాజోలు మండలం కూనవరం గ్రామానికి చెందిన కె. శ్రీనివాస్. కూనవరం గ్రామానికి చెందిన శ్రీనివాస్‌కు 50 ఏళ్లకే చూపు మందగించింది. వయసు పెరిగే కొద్దీ చూపు పూర్తిగా తగ్గిపోయింది. ఇక జీవితం అంతా చీకటిమయం అయిందని బాధతో జీవిస్తున్నాడు. ఈ పరిస్థితుల్లో అమలాపురంలో సదరం ధ్రువీకరణ పత్రం కోసం దరఖాస్తు చేసుకోగా అమలాపురం ఏరియా ఆస్పత్రిలోని డాక్టర్ వి.అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో శ్రీనివాస్‌కు కంటి వైద్య పరీక్షలు నిర్వహించి శస్త్ర చికిత్స చేస్తే కంటి చూపు వస్తుందని చెప్పారు. ఆపరేషన్ చేయించుకునేందుకు ఆర్థిక ఇబ్బందులు ఉన్నాయని శ్రీనివాస్ శస్త్ర చికిత్సకు వెనుకడుగు వేశాడు. కంటి వెలుగు కార్యక్రమం సమీక్షలో ఈ విషయం తెలుసుకున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా సంబంధిత అధికారులకు శ్రీనివాస్‌కు శస్త్ర చికిత్స చేయించాలని ఆదేశించారు. దీంతో శ్రీనివాస్‌కు శస్త్ర చికిత్స చేయడంతో పోయిన కంటి చూపు తిరిగి వచ్చింది. వైఎస్సార్ కంటి వెలుగు పథకం ద్వారా పూర్తిగా తన కళ్లకు ఉచితంగా శస్త్ర చికిత్స చేశారని, ఇక బతుకంతా చీకటిమయం అనుకున్న తనకు కంటి చూపు దక్కిందని సంతోషం వ్యక్తం చేశాడు.

మొబైల్ యాప్‌లతో న్యాయ సేవలు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): మొబైల్ యాప్‌ల ద్వారా న్యాయ సలహాలు, సేవలు పొందవచ్చని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూష కుమారి అన్నారు. ఆమె గురువారం మాట్లాడుతూ న్యాయ విభాగం, నల్సార్ ఆధ్వర్యాన న్యాయబంధు, టెలి లా ఫర్ సిటిజెన్స్ యాప్‌లను ప్రవేశపెట్టారన్నారు. ఆండ్రాయిడ్ స్మార్ట్‌ఫోన్ వినియోగదారులు గూగుల్ ప్లే స్టోర్ నుంచి ఇన్‌స్టాల్ చేసుకుని, వారి వ్యక్తిగత వివరాలు నమోదు చేసుకోవాలని తెలిపారు.

జనహిత కేటాయింపులు

- రాష్ట్ర బడ్జెట్‌లో అట్టడుగు వర్గాలకు పెద్ద పీట
- జిల్లాలో మహిళలు, రైతులు, మత్స్యకారులకు మేలు
- ఆర్‌బీకే వ్యవస్థ మరింత పటిష్టం
- గోదావరి డెల్టాకు రూ.23 కోట్లు




వైఎస్సార్ రైతు భరోసా అందుకుంటున్న రైతులు (ఫైల్)



సాక్షి అమలాపురం: ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చడమే కాకుండా అదనంగా ఎన్నో ప్రజోపయోగమైన పనులు చేస్తూ సంక్షేమానికి పెద్ద పీట వేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం తాజాగా గురువారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఆయా వర్గాలకు మరింత మేలు చేసేలా కేటాయింపులు చేసింది. రాష్ట్ర బడ్జెట్‌పై జిల్లాలోని అట్టడుగు వర్గాలు, రైతులు, పేదలు, మహిళల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. వ్యవసాయానికి ఆర్‌బీకేలు, రైతు భరోసా వంటి పథకాల ద్వారా భరోసా కల్పించడంతోపాటు, ఇరిగేషన్‌కు కేటాయింపులు చేశారు. ఇదే సమయంలో వివిధ పథకాల ద్వారా జిల్లాలోని మహిళలు, మత్స్యకారులు, చేనేత వంటి బడుగు బలహీన వర్గాల కార్మికులకు, కూలీలకు సైతం పెద్ద పీట వేయడంపై హర్షం వ్యక్తమవుతోంది.

విద్యా 'వికాసం'

- బడ్జెట్‌లో రాష్ట్ర వ్యాప్తంగా నాడు–నేడు, జగనన్న విద్యాదీవెన, అమ్మ ఒడి, రైతు భరోసా, ఆర్‌బీకే, చేయూత, ఎస్సీ, బీసీల కాంపోనెంట్‌కు పెద్ద ఎత్తున నిధులు కేటాయించడంపై ఆయా వర్గాలు సంతోషం వ్యక్తం చేస్తున్నాయి. జిల్లాలో ఆయా వర్గాల వారు అధికంగా లబ్ధి పొందనున్నారు.
- జగనన్న విద్యా కానుకకు రాష్ట్ర వ్యాప్తంగా రూ.560 కోట్లు కేటాయించారు. దీని వల్ల జిల్లాలో 1,21,880 మందికి మేలు జరిగింది. అమ్మ ఒడి ద్వారా 1,45,462 మందికి రూ.218.19 కోట్ల మేర లబ్ధి చేకూరింది. నాడు–నేడు కింద జిల్లాలో రెండవ దశలో 762 పాఠశాలలు, 11 జూనియర్ కాలేజీల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. వీటికి రూ.258 కోట్లు ఖర్చవుతోంది.
- జగనన్న విద్యాదీవెన ద్వారా జిల్లాలో షెడ్యూల్ కులాలకు చెందిన 10,321 మంది, షెడ్యూల్ తెగలకు చెందిన 209 మంది, వెనుకబడిన తరగతులకు చెందిన 14,906 మంది, ఈబీసీకి చెందిన 2,930 మంది, ముస్లిం మైనార్టీకి చెందిన 302 మంది, కాపు సామాజిక వర్గానికి చెందిన 9,065 మంది, క్రిస్టియన్ మైనారిటీకి చెందిన 167 మందికి వెరసి జిల్లా వ్యాప్తంగా 37,900 మంది విద్యార్థులకు రూ.25.09 కోట్ల మేర మేలు జరగగా, ఈ ఏడాది మరింత ప్రయోజనం పొందనున్నారు.
- జిల్లాలో చేయూత పథకం ద్వారా 89,174 మంది లబ్ధిదారులకు రూ.167.2 కోట్లు, మెప్మా పరిధిలో 7,154 మందికి రూ.13.41 కోట్లు లబ్ధి చేకూరింది. జగనన్న తోడు పథకానికి 14,758 మంది గత ఏడాది అర్హత సాధించగా రూ.14.75 కోట్లు వడ్డీ లేని రుణాలు ఇచ్చారు.
- జిల్లాలో వ్యవసాయ యాంత్రీకరణకు పెద్ద పీట వేశారు. గత ఏడాది జిల్లాలో 291 యూనిట్లు అందజేశారు. ఇందుకుగాను రూ.8.17 కోట్లు రాయితీగా అందించారు. 84 ట్రాక్టర్లకు రూ.2.21 కోట్లు, 39 కంబైన్డ్ హార్వెస్టర్లకు రూ.3.43 కోట్లు, పవర్ టిల్లర్లు, కల్టివేటర్లకు రూ.2.53 కోట్లు రాయితీగా ఇచ్చారు. ఈ ఏడాది మరిన్ని నిధులు పెంచడం వల్ల మేలు జరగనుంది. వైఎస్సార్ రైతు భరోసా ద్వారా జిల్లాలో 1,56,551 మంది రైతులకు రూ.211.34 కోట్ల మేర లబ్ధి పొందారు.



మధ్యడెల్టా ప్రధాన పంట కాలువ

గోదావరి డెల్టాకు రూ.23.37 కోట్లు కేటాయించారు. ఈ నిధులతో డెల్టాలో ముంపు తొలగింపు పనులు చేపట్టనున్నారు. పంట కాలువల్లో పూడిక తొలగింపు పనులు చేసే అవకాశముంది.

అభివృద్ధికి నిధులివ్వడం అభినందనీయం



రాష్ట్ర బడ్జెట్‌లో అభివృద్ధికి నిధులు కేటాయించడం అభినందనీయం. నాడు–నేడుకు రూ.3,500 కోట్లు, పరిశ్రమలకు రూ.2,600 కోట్లు, ఆర్‌అండ్‌బీకి రూ.9,118 కోట్లు చొప్పున కేటాయించారు. వీటి ద్వారా రాష్ట్రంలో మౌలిక సదుపాయాలు ఏర్పడి రాష్ట్ర అభివృద్ధి జోరందుకుంటుంది.

– మూల అన్నాజీరావు, ఆర్థిక శాస్త్ర అధ్యాపకుడు ఏఎస్ఎన్ మహిళా డిగ్రీ కాలేజీ, అమలాపురం

వ్యవసాయానికి అధిక ప్రాధాన్యం



వ్యవసాయ అనుబంధ రంగాలకు ప్రాధాన్యమిస్తూ రుపొందించిన బడ్జెట్ ఇది. రైతు భరోసా పథకం, వడ్డీ లేని రుణాలు, క్రాప్ ఇన్సూరెన్స్‌లలో వీలైనంత ఎక్కువ మంది రైతులకు ప్రయోజనం చేకూరేలా నిధులు కేటాయించారు. గతంలో పోలిస్తే వ్యవసాయానికి ఎక్కువ నిధులు కేటాయించారు. ఇరిగేషన్ శాఖ, వ్యవసాయ రంగంలో యాంత్రీకరణకు పెద్దపీట వేశారు.

– జున్నూరి రామారావు, ఏపీ అగ్రికల్చర్ మిషన్ సభ్యుడు. దేవగుప్తం, అల్లవరం మండలం

జనరంజకం



అన్ని వర్గాల సంక్షేమంతో పాటు సమగ్రాభివృద్ధి లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం జనరంజక బడ్జెట్ ప్రవేశపెట్టింది. బడుగు బలహీన వర్గాల సంక్షేమం, సుస్థిరాభివృద్ధికి, విద్య, వైద్య, ఆరోగ్యానికి పెద్దపీట వేశారు. నవరత్న పథకాలకు అధిక ప్రాధాన్యం ఇవ్వడంతో అన్ని వర్గాల సంక్షేమానికి, అభివృద్ధికి ఎంతో ప్రాధాన్యం ఇచ్చినట్లయ్యింది. వ్యవసాయం, పంచాయతీరాజ్, మహిళా సాధికారతకు వేల కోట్లు కేటాయించారు.

– విప్పర్తి వేణుగోపాలరావు, జెడ్పీ చైర్మన్, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా

కాపులకు బడ్జెట్ పెంచడం సంతోషం



కాపులకు గతంలో కంటే ప్రస్తుతం రూ.862 కోట్లు అదనంగా బడ్జెట్ పెంచడం చాలా సంతోషంగా ఉంది. కాపు సామాజిక వర్గంలో పేదలను గుర్తించి కాపు సంక్షేమానికి రూ.4,887 కోట్లు, వైఎస్సార్ కాపు నేస్తానికి రూ.550 కోట్లు ప్రకటించిన ప్రభుత్వానికి ముఖ్యంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు.

– చీకట్ల కిషోర్, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్

ఇళ్ల నిర్మాణాల్లో పురోగతి

హిమాన్షు శుక్లా సూచన



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ హిమాన్షు శుక్లా, జేసీ ధ్యానచంద్ర తదితరులు

అమలాపురం రూరల్: ప్రభుత్వ ప్రాధాన్య భవనాలు, నవరత్నాలు పేదలందరికీ ఇళ్ల నిర్మాణాల్లో పురోగతి సాధించాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా అధికారులను ఆదేశించారు. గురువారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.ఎస్.జవహర్‌రెడ్డి అమరావతి నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష రీ సర్వే, జాతీయ రహదారులకు భూసేకరణ, నివేశన స్థలాల కేటాయింపు, వేసవి తాగునీటి కార్యాచరణపై సన్నద్ధత, గృహ నిర్మాణాలు, జాతీయ గ్రామీణ ఉపాధి పథకం అమలు, స్వామిత్వ సర్వే, జగనన్న స్వచ్ఛ సంకల్పం, జల జీవన్ మిషన్, నైపుణ్యాభివృద్ధి శిక్షణ జాబ్‌మేళాల నిర్వహణ తదితర అంశాల పురోగతిపై సమీక్షించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుత సీజన్లో ప్రభుత్వ ప్రాధాన్య భవనాలు, ఉగాది నాటికి గృహ నిర్మాణ లక్ష్యాలు చేరు కోవాలని ఆదేశించారు. 90 రోజుల కాలవ్యవధిలో నివేశన స్థలాలు కేటాయించాలని స్వామిత్వ సర్వే ద్వారా గ్రామ కంఠాల సర్వే ప్రక్రియ సమర్థంగా చేపట్టి హక్కుపత్రాలు పంపిణీ చేయాలన్నారు. ఉపాధి హామీ పథకంలో కోరుకున్న వారికి పనులు కల్పిస్తూ సరాసరి వేతనాలను పొందే విధంగా ప్రోత్సహించాలన్నారు. అమృత్ సరోవర్ పథకం ద్వారా పంటలు, తాగునీటి చెరువుల అభివృద్ధికి ప్రాధాన్యమివ్వాలన్నారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపరిచేందుకు శిక్షణ, జాబ్‌మేళాలు నిర్వహించాలన్నారు. జలజీవన్ మిషన్‌లో ప్రతి ఇంటికి కుళాయి కనెక్షన్ ఇప్పించాలన్నారు. జేసీ ధ్యానచంద్ర, జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్ సత్తిబాబు, సీపీఓ వెంకటేశ్వర్లు, గృహ నిర్మాణ సంస్థ పీడీ ఎం. బాబురావు, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్, ఎస్ఈలు కృష్ణారెడ్డి, చంటిబాబు, డీసీహెచ్ ఎస్.పద్మశ్రీరాణి, డ్వామా పీడీ ఎస్.మధుసూదన్ పాల్గొన్నారు.

రికార్డు స్థాయిలో వీరేశ్వరునికి హుండీ రాబడి



హుండీని లెక్కిస్తున్న పాలక మండలి సభ్యులు, సిబ్బంది, భక్తులు

ఐ.పోలవరం: ప్రముఖ పుణ్యక్షేత్రం మురమళ్ల శ్రీభద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయానికి హుండీ రూపంలో రికార్డు స్థాయిలో ఆదాయం వచ్చింది. గడచిన 195 రోజులకుగాను రూ.26,92,302 ఆదాయం లభించిందని ఆలయ చైర్మన్ పెన్మత్స వాసురాజు, ఈఓ మాచిరాజు లక్ష్మీనారాయణ తెలిపారు. గురువారం ఆలయ ఆవరణలో దేవదాయ శాఖ తనిఖీ అధికారి రామలింగేశ్వరావు సమక్షంలో ఆలయ పాలక మండలి సభ్యులు, అర్చకులు, భక్తులు ఈ లెక్కింపులో పాల్గొన్నారు. 190 గ్రాముల వెండి, 22 గ్రాముల 500 మిల్లీ గ్రాముల బంగారం, మూడు విదేశీ కరెన్సీ నోట్లు వచ్చినట్లు అధికారులు తెలిపారు.

పొట్టి శ్రీరాములు మహా పురుషుడు



పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా, జేసీ ధ్యానచంద్ర తదితరులు

అమలాపురం రూరల్: ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ఆమరణ నిరాహార దీక్ష చేసి అమరజీవి అయిన పొట్టి శ్రీరాములు మహాపురుషుడని, భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు నాంది పలికారని కలెక్టర్ హిమాన్షు శుక్లా పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్‌లో పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఆయన స్వాతంత్ర్య ఉద్యమ పోరాటాలలో జైలు శిక్ష కూడా అనుభవించారన్నారు. ఆ మహనీయుని జ్ఞాపకార్థం రాష్ట్ర ప్రభుత్వం పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం స్థాపించిందన్నారు. నెల్లూరు జిల్లా పేరును 2005లో శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాగా మార్చారన్నారు. తపాలా శాఖ ఒక ప్రత్యేక స్టాంప్‌ను విడుదల చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ధ్యానచంద్ర, జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్ సత్తిబాబు, కలెక్టరేట్ పరిపాలనాధికారి కాశీ విశ్వేశ్వరరావు, సీపీవో వెంకటేశ్వర్లు, కలెక్టరేట్ ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రజాపంపిణీ మంత్రిత్వ శాఖ కన్సల్టేటివ్ కమిటీ సభ్యురాలిగా ఎంపీ అనురాధ



అల్లవరం: కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం, ప్రజా పంపిణీ మంత్రిత్వ శాఖ కన్సల్టేటివ్ కమిటీ సభ్యురాలిగా తనను నియమిస్తూ భారత ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు అందాయని ఎంపీ అనురాధ గురువారం తెలిపారు. కేంద్ర కోకోనట్ బోర్డు, కేంద్ర పెట్రోలియం, నేచురల్ గ్యాస్ స్టాండింగ్ కమిటీ సభ్యులు, టెలికామ్ అడ్వైజరీ కమిటీ సభ్యురాలిగా ఇప్పటికే సేవలు అందిస్తున్నానని తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, కేంద్ర ప్రభుత్వానికి ఎంపీ అనురాధ కృతజ్ఞతలు తెలిపారు.

పాఠవ ప్రదర్శనకు పోటీ

- తొమ్మిదో తరగతి విద్యార్థులకు ఈఎండీపీ అమలు
- గతేడాది అక్టోబర్ నుంచి పారిశ్రామిక అక్షరాస్యతపై బోధన
- జిల్లాలో 12,904 మందికి ప్రయోజనం
- నేడు అమలాపురంలో పది ప్రాజెక్టుల ఎక్స్‌పో



ఈఎండీపీలో భాగంగా తొమ్మిదో తరగతి విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టు

రాయవరం: విద్యార్థి దశ నుంచే పారిశ్రామిక ఆలోచనలు కల్పించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఇందుకు «వ్యవస్థాపక మనస్తత్వ అభివృద్ధి» కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. పారిశ్రామిక, ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించేందుకు ప్రయత్నిస్తోంది. గతేడాది అక్టోబర్ 14 నుంచి జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో 9వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఎంటర్‌ప్రెన్యూరియల్ మైండ్‌సెట్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్(ఈఎండీపీ)ను అమలు చేస్తున్నారు. పారిశ్రామిక, ఆర్థిక అక్షరాస్యతపై వారికి ఏ మేరకు అవగాహన కలిగిందో తెలుసుకునేందుకు ప్రాజెక్టుల ఎక్స్‌పోను శుక్రవారం అమలాపురంలో నిర్వహిస్తున్నారు.

జిల్లాలో పరిస్థితి ఇదీ..

జిల్లాలో 224 ప్రభుత్వ, జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఈఎండీపీ పాఠాలు నిర్వహిస్తున్నారు. ఇందుకుగాను తొమ్మిదో తరగతి బోధన చేసే ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. ఆ ఉపాధ్యాయులు ప్రతి శుక్రవారం తరగతులు నిర్వహించారు. ఆర్థిక అక్షరాస్యత బోధనలో భాగంగా బడ్జెట్, పొదుపు, ఖర్చు తదితర అంశాలపై చైతన్యం కలిగిస్తారు. సాంకేతికత, ఇతర ఉత్పత్తులను పరిచయం చేస్తారు. సమస్య ఎదురైతే పరిష్కారానికి ఎలాంటి నిర్ణయాలు తీసుకోవాలో అవగాహన కల్పిస్తారు. 18 అంశాల్లో విద్యార్థులకు శిక్షణ ఉంటుంది. ఈ విద్యా సంవత్సరంలో 18 సెషన్లను 30 పీరియడ్లలో పూర్తి చేస్తారు. శిక్షణలో భాగంగా ఒక్కో విద్యార్థి ఐదేసి ప్రాజెక్టులను రూపొందించాల్సి ఉంది. ఉపాధ్యాయులకు శిక్షణతో పాటుగా, బోధనాంశాలపై విలువైన సమాచారంతో కూడిన ఆన్‌లైన్ మాడ్యూల్స్‌ను సరఫరా చేశారు.

జిల్లా కమిటీ ఏర్పాటు

డీఈవో ఎం.కమలకుమారి పర్యవేక్షణలో సైన్స్ అధికారి ఆధ్వర్యంలో నిర్వహించే ఈఎండీపీ ఎక్స్‌పోలో విద్యార్థులు ప్రదర్శించే ప్రాజెక్టులను జిల్లా కమిటీ రాష్ట్ర స్థాయికి రెండు ప్రాజెక్టులను ఎంపిక చేయాల్సి ఉంది. అందుకుగాను జిల్లా సైన్స్ అధికారి, డీసీఈబీ కార్యదర్శి, ఎంజీ మున్సిపల్ హైస్కూల్ హెచ్ఎం, సమగ్ర శిక్షా ఏఎంవో, రామచంద్రపురం డీవైఈవో, ఈఎండీపీ జిల్లా మేనేజర్‌తో కమిటీని ఏర్పాటు చేశారు.

నేడు ప్రాజెక్టుల ఎక్స్‌పో

మండల స్థాయిలో విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టుల నుంచి జిల్లా స్థాయికి పది ప్రాజెక్టులను ఎంపిక చేశారు. మండపేట శ్రీగౌతమి మున్సిపల్ పాఠశాలకు చెందిన విద్యార్థులు అగ్రి యాప్, మల్టీపర్పస్ లిక్విడ్ (రెండు అంశాలలో), మామిడికుదురు జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు కల్టివేషన్ ఆఫ్ మెడిసినల్ ప్లాంట్స్, అమలాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు కోకోనట్ షెల్ పాట్స్, కప్స్, పాలగుమ్మి జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు పేపర్ బ్యాగ్స్, జి.అగ్రహారం జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు రెంటల్ కిచెన్–కుక్ యువర్ ఫుడ్, వి.అగ్రహారం మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులు స్పోర్ట్స్ హబ్, జెడ్పీహెచ్ఎస్ చింతలంక విద్యార్థులు ఓన్లీ సీ ఫుడ్ హబ్, కాట్రేనికోన జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు ఎకో ఫ్రెండ్లీ, జెడ్పీహెచ్ఎస్ కామనగరువు విద్యార్థులు హేండీ క్రాఫ్టస్ ప్రాజెక్టులు తయారు చేశారు. ఈ పది ప్రాజెక్టులను అమలాపురంలో ఉన్న మహాత్మాగాంధీ మున్సిపల్ హైస్కూల్‌లో ప్రదర్శించనున్నారు. ఉదయం 10గంటలకు ఈఎండీపీ ఎక్స్‌పోను సమగ్ర శిక్షా అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఎం.కమలకుమారి ప్రారంభించనున్నారు.

భవిష్యత్తుకు చక్కని పునాది



తొమ్మిదో తరగతి విద్యార్థుల భవిష్యత్తుకు ఈఎండీపీ చక్కని పునాది అని చెప్పవచ్చు. భవిష్యత్తు అవకాశాలను ముందే ఊహించడం ద్వారా జీవితంలో నిలదొక్కుకునే వీలుంది.

– ఎం.కమలకుమారి, డీఈవో, అమలాపురం

జిల్లాలో విజయవంతంగా అమలు



ఈ విద్యా సంవత్సరంలో ఈఎండీపీ కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేస్తున్నాం. విద్యార్థులు వినూత్న ఆలోచనలకు ఈఎండీపీ వేదికగా నిలుస్తుంది. వారు సద్వినియోగం చేసుకుంటున్నారు.

– చదలవాడ ఉదయ్‌కుమార్, ఈఎండీపీ జిల్లా కోఆర్డినేటర్, రాజమహేంద్రవరం

ఎక్స్‌పోను విజయవంతం చేయాలి



ప్రభుత్వం ప్రథమ్ సంస్థతో కలిపి నూతనంగా ఈ ఏడాది ఈఎండీపీ కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. పది ప్రాజెక్టుల నుంచి రాష్ట్ర స్థాయికి రెండు ప్రాజెక్టులను పంపిస్తాం.

– జీవీఎస్ సుబ్రహ్మణ్యం, జిల్లా సైన్స్ అధికారి, అమలాపురం

కలెక్టర్‌కు రూ.3 కోట్ల చెక్కు అందజేత

అమలాపురం రూరల్: కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) కింద వేదాంత సంస్థమేనేజర్ వి.సతీష్ రెడ్డి రూ.3 కోట్ల చెక్కును గురువారం కలెక్టర్ హిమాన్షు శుక్లాకు ఆయన చాంబర్‌లో అందించారు. మౌలిక సదుపాయాల అభివృద్ధి కోసం ఏడాదికి రూ.5 కోట్లు జిల్లా యంత్రాంగానికి అందిస్తున్నామని ఆయన తెలిపారు. ప్రస్తుత సంవత్సరంలో చివరి విడతగా రూ.3 కోట్ల చెక్కును ఇచ్చామని చెప్పారు. ఈ సందర్భంగా వేదాంత మేనేజర్ మాట్లాడుతూ ఉప్పలగుప్తం, అమలాపురం మండలాల్లో సంస్థ చేపట్టిన కార్యకలాపాలకు గాను ఈ నిధులు సమకూర్చామన్నారు. మరో కోటి రూపాయలు మౌలిక వసతుల కల్పనకు వెచ్చిస్తామన్నారు.

క్లుప్తంగా

బ్యాంకు ఖాతాలో రూ.26 వేలు గల్లంతు

ఆలమూరు: మండలంలోని సంధిపూడికి చెందిన వ్యాపారవేత్త సూరపురెడ్డి సూర్యనారాయణకు చెందిన ఖాతాలో రూ.26 వేలు గల్లంతయ్యాయి. స్థానిక యూనియన్ బ్యాంకులో ఆయనకు ఖాతా ఉంది. రెండు రోజుల క్రితం రూ.26 వేలు డ్రా చేసినట్టు సెల్‌ఫోన్‌లో సందేశం వచ్చింది. కంగారు పడ్డ ఆయన బ్యాంకు అధికారులను సంప్రదించగా ఖాతా లావాదేవీలను చూసి నగదు గల్లంతైన విషయాన్ని నిర్ధారించారు. దీనిపై ముంబయిలోని బ్యాంకు ప్రధాన కార్యాలయానికి ఫిర్యాదు చేశామని మేనేజర్ బి.ఉదయ్ తెలిపారు.

క్వాలిఫైడ్‌లకు ఉగాది ప్రైజ్

- జీవో 27 విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- అభ్యర్థుల హర్షాతిరేకాలు

రాయవరం: ఒకటి కాదు..రెండు కాదు ఏకంగా 24 ఏళ్ల అనంతరం వారి కలను రాష్ట్ర ప్రభుత్వం ఈడేరుస్తోంది. 1998 డీఎస్సీ క్వాలిఫైడ్ అభ్యర్థులకు ఉద్యోగాలు ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం జీవో నంబరు 27ను విడుదల చేసింది. కేబినెట్‌లో తీసుకున్న నిర్ణయం ప్రకారం విడుదలైన జీవోతో క్వాలిఫైడ్ అభ్యర్థుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం నిర్ణయంతో క్వాలిఫైడ్ అభ్యర్థులకు ప్రభుత్వం ఉగాది కానుకను ఇచ్చినట్టయింది. ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను వీరితో భర్తీ చేయనున్నారు. కాంట్రాక్టు ప్రాతిపదికన వీరి నియామకాలు చేపట్టి, ఎంటీఎస్ కింద వేతనాలు చెల్లిస్తారు.

క్వాలిఫైడ్ అభ్యర్థులు ఎలా అంటే..

1998 డీఎస్సీ సమయంలో 1:3 నిష్పత్తిలో అభ్యర్థులను ఇంటర్వ్యూకు పిలిచారు. ఇంటర్వ్యూకు అర్హత సాధించినప్పటికీ పోస్టు రాని వారిని క్వాలిఫైడ్ అభ్యర్థులుగా పేర్కొన్నారు. అంతకుముందు జరిగిన డీఎస్సీల్లో మిగిలిపోయిన వారికి రోస్టర్, సీనియారిటీ ప్రకారం ఖాళీ అయిన పోస్టులు కేటాయించినందున, ఆ విధంగానే భవిష్యత్తులో వచ్చే ఖాళీలను తమతో భర్తీ చేయాలని 1998 డీఎస్సీ క్వాలిఫైడ్ అభ్యర్థులు అప్పటి ప్రభుత్వాన్ని కోరారు. నాటి ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన రాక పోవడంతో పలువురు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఎట్టకేలకు ప్రభుత్వం పోస్టులు ఇస్తామని ప్రకటించి, జిల్లాల వారీగా అభ్యర్థుల అర్హతలను పరిశీలించి జాబితా సిద్ధం చేసింది. టీడీపీ ప్రభుత్వం వీరిని పట్టించుకొనకపోవడంతో తాము అధికారంలోకి రాగానే 1998 డీఎస్సీ క్వాలిఫైడ్ అభ్యర్థులకు న్యాయం చేస్తానని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్ర సమయంలో హామీ ఇచ్చారు. ఆయన ఇచ్చిన హామీ మేరకు క్వాలిఫైడ్ అభ్యర్థులకు న్యాయం చేసే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది.



1998 డీఎస్సీ క్వాలిఫైడ్ అభ్యర్థులు (ఫైల్ ఫొటో)

ఇప్పటికే సర్టిఫికెట్ల వెరిఫికేషన్ పూర్తి

గతేడాది సెప్టెంబర్ 26 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు అర్హులు వారి అంగీకారాన్ని తెలుపుతూ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తు చేసుకున్న వారి సర్టిఫికెట్లను కాకినాడ జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో గతేడాది అక్టోబర్ 6వ తేదీ నుంచి 14వ తేదీ లోపు పరిశీలన జరిపి సీనియారిటీ జాబితాను రూపొందించారు. 1998 డీఎస్సీలో అధికంగా 55 ఏళ్ల పైబడిన వారే ఉన్నారు. చాలామంది ప్రైవేటు పాఠశాలల్లో ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. కొందరు ఇతర వృత్తుల్లో స్థిరపడ్డారు. ఉపాధ్యాయ వృత్తిలో చేరేందుకు ఉమ్మడి జిల్లా నుంచి 556 మంది దరఖాస్తు చేసుకున్నారు. నలుగురు విల్లింగ్ ఇవ్వలేదు. 556 మందిలో 70 మంది సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు గైర్హాజరయ్యారు. మిగిలిన 486 మంది ఉపాధ్యాయ వృత్తిలో చేరేందుకు అంగీకరించారు. జీవో 27 ప్రకారం రూపొందించే నియమ నిబంధనలను అనుసరించి నియామకాలు జరిగే అవకాశముంది. ఈ నియమ నిబంధనలు రెండు మూడు రోజుల్లో విడుదలయ్యే అవకాశమున్నట్టు సమాచారం.

ఉగాది కానుకగా..

ప్రభుత్వం ఇప్పటికే ఉపాధ్యాయుల పదోన్నతుల ప్రక్రియ చేపట్టింది. ఈ ప్రక్రియలో భాగంగా ఎస్‌జీటీ నుంచి స్కూల్ అసిస్టెంట్లకు, స్కూల్ అసిస్టెంట్ల నుంచి హెచ్‌ఎంలకు, హెచ్‌ఎంల నుంచి ఎంఈవోలకు పదోన్నతులు తాత్కాలిక ప్రాతిపదికన చేపట్టారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా భారీగా సర్దుబాట్లు చేశారు. పదోన్నతులు, సర్దుబాట్ల ప్రక్రియ పూర్తయిన అనంతరం ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఏర్పడ్డ ఖాళీల్లో 1998 డీఎస్సీ క్వాలిఫైడ్ అభ్యర్థులను నియమించనున్నారు. ముఖ్యంగా ఏకోపాధ్యాయ పాఠశాలల్లో డీఎస్సీ క్వాలిఫైడ్ అభ్యర్థులను నియమించే అవకాశమున్నట్టు తెలుస్తోంది.

సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం



1998 క్వాలిఫైడ్ అభ్యర్థుల కుటుంబాలు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాయి. మా జీవితాల్లో వెలుగులు నింపిన ఈ చర్య రాష్ట్ర చరిత్రలో ఒక ప్రత్యేక అధ్యాయంగా నిలుస్తుంది. మా పోరాటానికి న్యాయం జరిగినట్టు అయింది.

– కోటిపల్లి రాంబాబు, జిల్లా అధ్యక్షుడు, 1998 క్వాలిఫైడ్ టీచర్స్ అసోసియేషన్, మండపేట

ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్నాం



ఉద్యోగాల్లో చేరేందుకు ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్నాం. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మా జీవితాలకు భరోసా ఇచ్చారు. పాదయాత్రలో ఇచ్చిన హామీని నెరవేర్చడం మా సమస్య పట్ల ఉన్న చిత్తశుద్ధిని తెలియజేసింది.

– టిల్లపూడి సత్యనారాయణ, 1998 క్వాలిఫైడ్ సంఘ నేత, వెదురుపాక, రాయవరం మండలం

ఆదిత్య విద్యార్థికి బంగారు పతకం



సాంబశివరావును అభినందిస్తున్న ఆదిత్య కళాశాలల వైస్ చైర్మన్ సతీష్‌రెడ్డి

గండేపల్లి: మండలంలోని సూరంపాలెం ఆదిత్య కళాశాలకు చెందిన కె.సాంబశివరావు సౌత్‌జోన్ క్రీడా పోటీల్లో ప్రతిభ చూపి గోల్డ్, సిల్వర్ మెడల్స్ సాధించినట్టు ఆదిత్య కళాశాలల వైస్ చైర్మన్ ఎన్.సతీష్‌రెడ్డి గురువారం తెలిపారు. ఆదిత్య పాలిటెక్నిక్ కళాశాలలో ఈసీఈ విభాగంలో ప్రథమ సంవత్సరం చదువుతున్న సాంబశివరావు ఈ నెల 11, 12 తేదీల్లో తెలంగాణలో జరిగిన ఆల్ ఇండియా సౌత్ జోన్ ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్‌లో పాల్గొన్నాడు. షార్ట్ పుట్ విభాగంలో ప్రతిభ చూపి గోల్డ్ మెడల్, డిస్కస్‌త్రోలో సిల్వర్ మెడల్ అందుకున్నట్టు వివరించారు. సాంబశివరావును ప్రిన్సిపాల్ ఎస్‌టీవీఎస్ కుమార్, ఫిజికల్ డైరెక్టర్లు కె.రాజు, సీహెచ్ కిరణ్‌కుమార్, డీన్ ఏవీ మాధవరావు అభినందించారు.

రూ.4 లక్షల రికవరీ

యానాం: లారీ బియ్యం లోడుతో వెళుతూ అదృశ్యమైన కేసులో వ్యక్తిని అరెస్ట్ చేసి, రూ.4లక్షలు రికవరీ చేసినట్లు సీఐ షణ్ముగం, ఎస్సైలు కట్టా సుబ్బరాజు, శేరు నూకరాజు గురువారం తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని గాయత్రి రైస్‌మిల్లు నుంచి గత నెలలో రూ.18 లక్షల విలువచేసే ఉప్పుడు బియ్యం లోడు కేరళకు బయలుదేరిందని, మార్గమధ్యలో లారీ డ్రైవర్, క్లీనర్ కుమ్మక్కయ్యి ఉప్పుడు బియ్యంను అమ్మేశారని తెలిపారు. పోలీసుల దర్యాప్తులో నిందితుల నుంచి రూ.4 లక్షలు, ఐదు బియ్యం బస్తాలు రికవరీ చేసినట్లు తెలిపారు.

ఆర్టీసీ బస్సు, ఆటో ఢీ

– ముగ్గురికి గాయాలు

గోకవరం: మండలంలోని రాజుపాలెం శివారున గురువారం ఆర్టీసీ బస్సు, ఆటో ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురు గాయాలపాలయ్యారు. వివరాల ప్రకారం గోకవరం నుంచి అడ్డతీగల వెళుతున్న బస్సు, జగన్నాథపురం నుంచి గోకవరం వైపు వస్తున్న ఆటో ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్‌తో పాటు ఆటోలో ప్రయాణిస్తున్న ఇద్దరు మహిళలు గాయపడ్డారు. సమాచారం అందుకున్న 108 సిబ్బంది క్షతగాత్రులను గోకవరం ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స అందించారు.

సెకండ్ ఇంటర్ పరీక్షలు ప్రారంభం

- ఉమ్మడి జిల్లాలో 44, 202 మంది విద్యార్థులు హాజరు
- 140 కేంద్రాల్లో ప్రశాంతంగా నిర్వహణ

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు గురువారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఈ పరీక్షలకు మొత్తం 44,202 మంది హాజరయ్యారు. తూర్పు గోదావరి, కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, ఏఎస్ఆర్ జిల్లాల్లో 140 కేంద్రాల్లో ఈ పరీక్షలు జరిగాయి. రెండో రోజు ద్వితీయ సంవత్సరం జనరల్ విభాగంలో తెలుగు, సంస్కృతం, హిందీ, వృత్తి విద్యా విభాగంలో జీఎఫ్‌సీ విభాగాల్లో పరీక్షలు జరిగాయి. వీటికి తూర్పుగోదావరి జిల్లా పరిధిలో జనరల్ విభాగంలో 10,893 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉంది. 10,758 మంది హాజరుకాగా, 135 మంది పరీక్షలు రాయలేకపోయారు. ఒకేషనల్ విభాగంలో 1,009 మందికి గాను 945 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. 64 మంది గైర్హాజరయ్యారు. కాకినాడ జిల్లా పరిధిలో జనరల్ విభాగంలో 17,434 మంది పరీక్షలు రాయాల్సి ఉంది. అయితే 16,934 మంది హాజరుకాగా, 500 మంది రాయలేకపోయారు. ఒకేషనల్ విభాగంలో 1,217 మందికిగాను 1,174 మంది రాశారు. 43 మంది గైర్హాజరయ్యారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పరిధిలో జనరల్ విభాగంలో 10,937 మంది పరీక్షలు రాయాల్సి ఉంది. అయితే 10,603 మంది హాజరుకాగా, 334 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విభాగంలో 2,069 మందికి గాను 1,941 మంది పరీక్షలు రాశారు. 128 మంది పరీక్షలు రాయలేకపోయారు. ఏఎస్ఆర్ జిల్లా పరిధిలో జనరల్ విభాగంలో 1,920 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా 1,628 మంది హాజరుకాగా, 292 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విభాగంలో 229 మందికి గాను 219 మంది పరీక్షలు రాశారు. 10 మంది హాజరు కాలేదు.



రాజమహేంద్రవరం కందుకూరి రాజ్యలక్ష్మి మహిళా కళాశాలలో పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థినులు

పరీక్షా సమయానికి అరగంట ముందు చేరుకోండి

ఇంటర్ పరీక్షలు ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతాయి. పరీక్షలు ప్రారంభమైన తొలిరోజు బుధవారం కొందరు విద్యార్థులు సరిగ్గా తొమ్మిది గంటలకు, తర్వాత 9.15 గంటలలోపు హడావుడిగా సెంటర్ల వద్దకు చేరుకున్నారు. అయితే రెండో రోజు ఇదే పరిస్థితి పలు పరీక్షా కేంద్రాల వద్ద కనిపించింది. ఇదిలావుంటే రాజమహేంద్రవరం ఎస్‌కేఆర్ కళాశాలలో జరుగుతున్న పరీక్ష కేంద్రానికి ఒక విద్యార్థిని 9.30 గంటలకు వచ్చింది. లోపలికి పంపమని అడిగినా అప్పటికే అటెండెన్స్ పూర్తికావడంతో అనుమతించలేదు. దీంతో ఆ విద్యార్థి రోదించింది. పరీక్ష సమయం 9.30కు అనుకున్నామని ఆ విద్యార్థి తండ్రి చెప్పాడు. ఇటువంటి ఘటనల నేపథ్యంలో విద్యార్థులు కనీసం అరగంట ముందైనా పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని జోన్ 1,2 రీజినల్ జాయింట్ డైరక్టర్ ఐ.శారద సూచించారు. ఈ విషయంలో ఆయా కళాశాలల యాజమాన్యాలు, తల్లిదండ్రులు అప్రమత్తమవ్వాలన్నారు.

కాకినాడలో కారు బీభత్సం

- మద్యం మత్తులో డ్రైవర్ నిర్వాకం
- ఆరుగురికి గాయాలు
- కారు సహా ద్విచక్ర వాహనాలు, సైకిల్ ధ్వంసం



కారు, ద్విచక్ర వాహనం, సైకిల్‌ను ఢీకొన్న కారు



ప్రమాదానికి కారణమైన వేగనార్ కారు

కాకినాడ క్రైం: కాకినాడలో ఓ కారు బీభత్సం సృష్టించింది. మద్యం మత్తులో కారు నడిపిన డ్రైవర్ ఆరుగురిని ఢీకొట్టి ఐదు వాహనాలను ధ్వంసం చేశాడు. కాకినాడ త్రీటౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు, అనకాపల్లికి చెందిన మేఘాద్రిరాజు అదే పట్టణానికి చెందిన ఓ వ్యాపారి వద్ద డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. సదరు వ్యాపారి కుమార్తె కాకినాడ జగన్నాథపురంలోని అమ్మమ్మ వద్ద ఉంది. ఆమెను అనకాపల్లి తీసుకెళ్లేందుకు తన వేగనార్ కారునిచ్చి గురువారం డ్రైవర్ రాజుని పంపాడు. రాజు అనకాపల్లి నుంచి వచ్చి కాకినాడ శివారులో మద్యం సేవించాడు. ఆ మత్తులోనే కారు నడుపుతూ మసీద్ సెంటర్ వరకు చేరాడు. అది దాటి గోల్డ్ మార్కెట్ సెంటర్‌కు సమీపించే సరికి రోడ్డు పక్కన నిలుచొని ఉన్న ఓ మహిళను ఢీకొట్టాడు. అక్కడి నుంచి ముందుకెళ్లి ఇద్దరు ప్రయాణిస్తున్న ఓ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టాడు. సమీపంలో మరో ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టగా ఆ వాహనంపై ప్రయాణిస్తున్న ఇద్దరు ప్రయాణికులు గాయపడ్డారు. ముందుకెళ్లి సైకిల్‌పై వెళుతున్న ఓ విద్యార్థినిని ఢీకొట్టి ఆమె ముందు నిలిపి ఉంచిన షిఫ్ట్ కారును ఢీకొట్టి ఆగాడు. సుమారు అరగంట పాటు సాగిన ఈ బీభత్సంలో ఆరుగురికి గాయాలు కాగా, ఓ కారు, మూడు ద్విచక్ర వాహనాలు, ఓ సైకిల్ పూర్తిగా ధ్వంసమయ్యాయి. నిందితుడు రాజును పోలీసులు అదుపులోకి తీసుకొన్నారు. బాధితులంతా చిన్నపాటి గాయాలతో బయటపడ్డారని పోలీసులు తెలిపారు. ప్రమాదానికి కారణమైన వేగనార్ కారును సీజ్ చేసినట్లు తెలిపారు.

గంజాయి పట్టివేత

- రూ.1.12 లక్షల విలువైన 32 కేజీల సరకు స్వాధీనం
- తొమ్మిది మంది అరెస్ట్

అన్నవరం: స్థానిక మండపాం సెంటర్ వద్ద, రైల్వేస్టేషన్ రోడ్డులోని గోపాలపట్నంలో దాడులు జరిపి రూ.1.12 లక్షల విలువైన 32 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకొని, తొమ్మిది మందిని అరెస్ట్ చేసినట్లు పెద్దాపురం డీఎస్పీ సుంకర మురళీమోహన్ తెలిపారు. గురువారం ఆయన అన్నవరం పోలీస్‌స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నారని చెప్పారు. ఈ ముఠా సభ్యులు రంపపు పొట్టును ప్యాకెట్లుగా కట్టి వాటిని కూడా గంజాయి నమ్మించి విక్రయిస్తూ మోసానికి పాల్పడుతున్నారని తెలిపారు. ఘటనా స్థలంలో పది రంపపుపొట్టు మూటలు కూడా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ప్రత్తిపాడు సీఐ కె.కిషోర్‌బాబు ఆధ్వర్యంలో అన్నవరం ఎస్ఐ పి.శోభన్‌కుమార్, శంఖవరం డిప్యూటీ తహసీల్దార్ తదితరులు అన్నవరం, గోపాలపట్నంలో దాడులు నిర్వహించినట్లు తెలిపారు. అరెస్ట్ అయిన వారిలో తొండంగి మండలం గోపాలపట్నంలో ఉంటున్న (స్వస్థలం రాజవొమ్మంగి) పాలపర్తి వేంకట కొండలరావు, కిర్లంపూడి మండలం సోమవరానికి చెందిన పంచదార్ల వీరబాబు, అల్లూరి సీతారామరాజు జిల్లా కొయ్యూరుకు చెందిన కొర్రా కామరాజు, రాజవొమ్మంగి మండలం లోదొడ్డికి చెందిన గమ్మెల సాంబశివ, పిఠాపురానికి చెందిన పూచి రామస్వామి, తమిళనాడు రాష్ట్రం మదురైకి చెందిన యోగ్నం జయపాండే, యోగపాండియన్, పవన్‌రాజ్ మనోజ్‌కుమార్, పెద్దాపురం మండలం తూర్పుపాకలకు చెందిన మండపాక పూర్ణ వేంకటేశ్వరరావు ఉన్నారు. కాగా, రౌతులపూడి మండలం ఎస్.పైడిపాలకు చెందిన కాళ్ల శివ జమీల్, రాజవొమ్మంగి మండలం వట్టిగడ్డకు చెందిన నాయుడు పరారీలో ఉన్నట్లు తెలిపారు. గంజాయితో బాటు రెండు మోటార్ సైకిళ్లు, ఆరు సెల్ ఫోన్లు కూడా స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ వివరించారు.



విలేకరులతో మాట్లాడుతున్న డీఎస్పీ మురళీమోహన్, పక్కన సీఐ కిషోర్‌బాబు, ఎస్ఐ శోభన్ కుమార్

లారీని ఢీకొన్న ప్రైవేట్ విద్యాసంస్థ బస్

ఉండ్రాజవరం: మండలంలోని ఒక జూనియర్ కళాశాలకు చెందిన బస్సు లారీని ఢీకొన్న ఘటనలో పలువురు విద్యార్థులు గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం నిడదవోలు మండలం మునిపల్లి–వేలివెన్ను రోడ్డులో కళాశాలకు చెందిన బస్ గురువారం మధ్యాహ్నం తణుకులో ఇంటర్మీడియెట్ పరీక్షలు రాసిన విద్యార్థులను తీసుకుని క్యాంపస్‌కు వెళుతుండగా లారీని ఢీకొట్టడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. గాయాలైన విద్యార్థులను తణుకు ప్రయివేట్ ఆసుపత్రికి తరలించి వైద్య సేవలు అందించారు.



లారీని ఢీకొన్న బస్

నిందితులను అరెస్ట్ చేయాలంటూ ఆందోళన

- విద్యార్థిని మృతదేహంతో బంధువుల రాస్తారోకో
- గొల్లప్రోలు పోలీసు స్టేషన్ వద్ద ఉద్రిక్తత

పిఠాపురం: విద్యార్థిని ఆత్మహత్యకు కారణమైన వారిని తక్షణమే అరెస్టు చేయాలంటూ గురువారం మృతురాలి బంధువులు గొల్లప్రోలు పోలీసు స్టేషన్ వద్ద మృతదేహంతో రాస్తారోకో నిర్వహించారు. తమకు న్యాయం జరిగే వరకూ అక్కడ నుంచి కదలమని ఆందోళనకారులు భీష్మించడంతో గొల్లప్రోలు పోలీసు స్టేషన్ వద్ద ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు, మృతురాలి బంధువుల కథనం ప్రకారం గొల్లప్రోలు మండలం దుర్గాడకు చెందిన వెలుగుల భాను (21) గొల్లప్రోలులోని ఓ ప్రైవేటు కళాశాలలో బీఎస్సీ సెకండ్ ఇయర్ చదువుతోంది. గత ఫిబ్రవరి 23న మృతురాలి స్నేహితురాలు సత్య తండ్రి రావుల ఈశ్వరరావు భానుకు ఫోన్ చేసి నీ వల్లే మా అమ్మాయి చెడి పోతోందని దుర్భాషలాడాడు. దీంతో మనస్థాపానికి గురైన ఆమె పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. బంధువులు కత్తిపూడిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స అనంతరం ఇంటికి తీసుకువచ్చారు. మార్చి 7న ఆమె తీవ్ర అస్వస్థతకు గురికావడంతో కాకినాడలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందింది. ఆమె మృతదేహానికి గురువారం కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో శవపంచనామా నిర్వహించారు. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



ఆందోళన కారులతో మాట్లాడుతున్న కాకినాడ డీఎస్పీ మురళీకృష్ణారెడ్డి

విద్యార్థిని మృతదేహంతో రాస్తారోకో

మృతురాలు భానును ఆమె స్నేహితురాలు సత్య తండ్రి రావుల ఈశ్వరరావు దుర్భాషలాడడం, కళాశాల ప్రిన్సిపాల్ డి.గంగా మహేష్ మందలించడం వల్లే ఆత్మహత్య చేసుకుందని, వెంటనే వారిపై హత్య కేసు నమోదు చేసి అరెస్టు చేయాలంటూ విద్యార్థిని మృతదేహంతో బంధువుల రాస్తారోకో నిర్వహించారు. సుమారు 2 గంటల పాటు ఆందోళన చేయడంతో గొల్లప్రోలు పోలీసు స్టేషన్ వద్ద ట్రాఫిక్ నిలిచిపోయింది. కాకినాడ డీఎస్పీ పి.మురళీకృష్ణారెడ్డి, పిఠాపురం సీఐ వైఆర్‌కే శ్రీనివాస్, జెడ్పీటీసీ వులవకాయల నాగ లోవరాజు సంఘటన స్థలానికి చేరుకుని ఆందోళన కారులతో చర్చించారు. ఆత్మహత్యకు కారకులైన వారిపై కేసు నమోదు చేస్తామని లిఖిత పూర్వకంగా హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.